


# త్వరలో ఊహించని కాంబినేషన్‌ని చూస్తారు

'ఇండస్ట్రీలో నాకు నచ్చే వ్యక్తుల్లో విశ్వక్‌సేన్ ఒకడు. నాలాగే విశ్వక్ వర్క్‌హాలిక్. అతని ఉడుకురక్తం, దూకుడుతనం నాకిష్టం. ఈ సినిమా ట్రైలర్‌లో అవి కనిపిస్తున్నాయ్. త్వరలో ఓ మంచి వార్త చెబుతా. ఊహించని కాంబోని మీరంతా చూడబోతున్నారు.' అని నందమూరి బాలకృష్ణ అన్నారు. విశ్వక్‌సేన్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. అంజలి, నేహాశెట్టి కథానాయికలు. కృష్ణచైతన్య దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బాలయ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఇంకా చెబుతూ ' వచ్చే యువతరానికి విశ్వక్‌సేన్ లాంటి హీరోలే ప్రేరణ. నన్ను కాదు ఇప్పుడున్న యువహీరోలను ఇన్‌స్పిరేషన్‌గా తీసుకో అని మా మోక్షజ్ఞకు కూడా చెబుతుంటాను. మంచి టీమ్ పనిచేసిన ఈ సినిమా విజయం సాధించడం ఖాయం. సినిమా చూసి విజయోత్సవ సభలో మాట్లాడతా.' అన్నారు బాలకృష్ణ. విశ్వక్‌సేన్ మాట్లాడుతూ– 'ఫైట్ ప్రాక్టీస్ చేస్తూ లారీపై నుంచి కిందపడ్డా. దేవుడి దయవల్ల ఏం కాలేదు. ఆ టైమ్‌లో బాలయ్యగారు కాల్ చేశారు. బాధ పడ్డారు. కంగారు పడ్డారు. కుటుంబసభ్యులు తర్వాత నాపై అంత ప్రేమ చూపించారు. లవ్‌యూ సార్. తెలుగోడి ఆత్మగౌరవం ఎన్టీయార్ గారు. ఆయన ఫొటో పెట్టే ఈ సినిమా స్టార్ట్ చేశాం. అనుకోకుండా ఈ వేడుక కూడా ఆయన పుట్టినరోజే జరగడం యాదృశ్చికం. అయిదేళ్లు నన్ను సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్. ఎలాంటి సినిమా చేయాలని కోరుకున్నానో అలాంటి కథ నా దగ్గరకు తెచ్చాడు కృష్ణచైతన్య. నా కెరీర్‌లో బెస్ట్ ప్రొడ్యూసర్స్ నాగవంశీ, సాయిసౌజన్య. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. నిజాయితీగా పనిచేశాం. మే 31న ఫ్యామిలీతో రండి' అని నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. ఈ వేడుకలో భాగంగా స్వర్గీయ ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి చిత్ర యూనిట్ నివాళులు అర్పించారు.

# అభినవ లక్ష్మీదేవి పాత్రలో..?



ప్రభాస్ పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జూన్ 27న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో సినిమాకు సంబంధించిన సరికొత్త అప్‌డేట్స్ అభిమానుల్లో జోష్‌ని నింపుతున్నాయి. కొద్ది రోజుల కిత్రం విడుదల చేసిన బుజ్జి వాహనం సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ చిత్రంలో ప్రభాస్ భైరవగా, అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. అయితే కథానాయిక దీపికా పడుకోన్ పాత్ర తాలూకు ఏ విషయాన్ని ఇప్పటివరకు చిత్ర బృందం పంచుకోలేదు. దాంతో ఆమె క్యారెక్టర్ గురించి అభిమానుల్లో క్యూరియాసిటీ ఎక్కువవుతున్నది. ఈ నేపథ్యంలో దీపికా పడుకోన్ పాత్ర గురించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. ఈ సినిమాలో ఆమె పునర్జన్మ పొందిన లక్ష్మీదేవి పాత్రలో కనిపించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె పేరు పద్మ అని చెబుతున్నారు. విష్ణుమూర్తి పదో అవతారమైన 'కల్కి' అంశం ప్రధానంగా సోషియో ఫాంటసీ సైంటిఫిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలో దీపికా పడుకోన్ పాత్రపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నాగ్‌అశ్విన్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది.



# మెగాస్టార్‌కు గోల్డెన్ వీసా

ఇటీవలే దేశంలో రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్‌ను అందుకున్నారు అగ్ర నటుడు చిరంజీవి. తాజాగా ఆయన మరో అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) టూరిజం కల్చరల్ డిపార్ట్‌మెంట్ అందించే ప్రతిష్టాత్మక యూఏఈ గోల్డెన్ వీసాను స్వీకరించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధరంగాల్లో గొప్ప పేరుప్రఖ్యాతులు గడించిన ప్రముఖులకు అబుదాబీ ప్రభుత్వం ఈ వీసాను అందజేస్తుంటుంది. తాజాగా దీనిని అందుకున్న వారి జాబితాలో మెగాస్టార్ చిరంజీవి చేరారు. గతంలో సినీ రంగం నుంచి రజనీకాంత్, షారుఖ్‌ఖాన్ సైతం ఈ వీసాను అందుకున్నారు.



# రక్తసిక్తమైన కల్యాణ్‌రామ్ పిడికిలి

నందమూరి కల్యాణ్‌రామ్ 21వ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ను ఎన్టీయార్ జయంతి సందర్భంగా మేకర్స్ విడుదల చేశారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రానికి అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బసులు నిర్మాతలు. మంగళవారం విడుదల చేసిన గ్లింప్స్‌లో కల్యాణ్‌రామ్ చేతిని మాత్రమే మేకర్స్ రివీల్ చేశారు. చేతికి రుద్రాక్షమాల.. చేతినిండా రక్తం.. బిగించి వున్న కల్యాణ్‌రామ్ పిడికిలి.. వీటిని ఈ గ్లింప్స్‌లో చూడొచ్చు. 'ది ఫిస్ట్ ఆఫ్ ఫ్రేమ్' కొటేషన్‌తో విడుదలైన ఈ గ్లింప్స్ ద్వారా కల్యాణ్‌రామ్ కేరక్టర్ ఇందులో ఎంత శక్తిమంతంగా ఉంటుందో దర్శకుడు చెప్పకనే చెప్పాడు. విజయశాంతి ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. 'సరిలేరు నీకెవ్వరు' తర్వాత ఆమె చేస్తున్న సినిమా ఇదే. 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ డైనమిక్ పాత్రలో ఆమె కనిపించనున్నారని మేకర్స్ ప్రకటించారు. సోహైల్‌ఖాన్, సాయి మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. ఈ చిత్రానికి కెమెరా: రామ్‌ప్రసాద్, సంగీతం: అజనీష్ లోకనాథ్, స్క్రీన్‌ప్లే: శ్రీకాంత్ విస్సా. నిర్మాణం: అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్.



# ఈ సమ్మర్‌కి సరైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్

'నాకు కొంచెం కాన్ఫిడెన్స్ తక్కువ. అందుకే చుట్టూ వున్న వాళ్ల దగ్గర నుంచి తీసుకుంటూ వుంటా. 'బేబీ' చేసేటప్పుడు 'సినిమా ఎలా వస్తుంది?' అని సాయిరాజేశ్, ఎస్‌కేఎన్, మారుతిగార్లకు పదే పదే కాల్‌చేసి అడిగేవాడ్ని. 'నువ్వు చేస్తున్న సినిమా సాధారణమైనది కాదు.. ఈ సినిమాతో నీ కెరీర్ మారిపోతుంది' అని ఓరోజు మారుతి చెప్పారు. ఆయన అన్నదే జరిగింది. ఈ సినిమా విషయంలోనూ అలాగే దర్శకుడు ఉదయ్‌ని పదేపదే ఫోన్లు చేసి విసిగించేవాడ్ని. నిన్న సంబంధంలేని కొందరు యూత్‌కి 'గం గం గణేశా..' స్పెషల్ షో వేసి చూపించాం. వాళ్లంతా సూపర్‌గా ఎంజాయ్ చేశారు. అప్పుడు నమ్మకం కుదిరింది. ఈ సమ్మర్‌కు సరైన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'గం గం గణేశా..' అన్నారు హీరో ఆనంద్ దేవరకొండ. ఆయన హీరోగా రూపొందిన ఈ చిత్రానికి ఉదయ్‌శెట్టి దర్శకుడు. కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మాతలు. ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రీరిలీజ్ వేడుకలో ఆనంద్ దేవరకొండ మాట్లాడారు. అతిథిగా విచ్చేసిన రష్మిక మందన్నా మాట్లాడుతూ 'ఆనంద్ నాకు ఒక బ్రదర్. తనకి తెలీదు.. తనపై నేను చాలా డిపెండ్ అవుతుంటా. ఈ సినిమా సక్సెస్ అయితే ఆనంద్ మొహంలో నవ్వు ఉంటుంది. ఆ నవ్వే నేను కోరుకునేది. అందుకే ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ కావాలి' అని ఆశాభావం వెలిబుచ్చింది. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులతో పాటు నిర్మాత బన్నీవాసు, 'బేబీ' దర్శకుడు సాయిరాజేశ్, 'బేబీ' నిర్మాత ఎస్‌కేఎన్, డైరెక్టర్ అనుదీప్ కె.వి, మధుర శ్రీధర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# బచ్చలమల్లి భావోద్వేగ ప్రయాణం



అల్లరి నరేశ్ కామెడీ రోల్స్ ఎక్కువ చేసినా.. తను జనాల మెప్పు పొందింది మాత్రం సీరియస్ పాత్రల్లోనే. ప్రాణం, నేను, గమ్యం, శంభో శివశంభో, నాంది, మహర్షి.. రీసెంట్‌గా వచ్చిన 'నా సామిరంగ'.. ఈ సినిమాలన్నింటిలో ఆయన చేసింది ఎమోషనల్ కేరక్టర్లే. అవే నటుడిగా అల్లరి నరేశ్‌ను ఓ స్థాయిలో నిలబెట్టాయి. ఈ కోవలోనే ఆయన చేస్తున్న సినిమా 'బచ్చల మల్లి'. 1990 కాలంనాటి భావోద్వేగ ప్రయాణంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఉద్వేగవంతమైన పాత్రలో అల్లరి నరేశ్ కనిపించనున్నారు. సుబ్బు మంగదేవి దర్శకుడు. రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మాతలు. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను మంగళవారం మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో మునుపెన్నడూ చూడని మాస్ అవతారంలో, సీరియస్ లుక్‌తో అల్లరి నరేశ్ కనిపించారు. రిక్షామీద కూర్చుని సిగరెట్ తాగుతూ, మ్యాసీ హెయిర్, గడ్డంతో మాస్ ప్రేక్షకులకు మెచ్చేలా అల్లరి నరేశ్ లుక్ ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అమృత అయ్యర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో రోహిణి, రావు రమేశ్, అచ్యుత్‌కుమార్, బలగం జయరామ్, హరితేజ, వైవా హర్ష, ప్రవీణ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కథనం: విప్పర్తి మధు, కెమెరా: రిచర్డ్ ఎం.నాథన్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్.



*దివంగత మహానటుడు నందమూరి తారక రామారావు 101వ జయంతి వేడుకలు మంగళవారం ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. పలువురు సినీ ప్రముఖులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నందమూరి మోహనకృష్ణ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.*

# పేరుకు తగ్గట్టే సినిమా వేగంగా ఉంటుంది



'ఏదో సాధించాలని ఊరిని వదిలి సిటీలకు వస్తుంటాం. అలా వచ్చి కొన్ని కోల్పోతాం. కొన్ని సాధిస్తాం. చివరకు లక్ష్యాన్ని చేరుకున్నామా లేదా అనేది చూసుకుంటాం. ఇందులో హీరో ఒక లక్ష్యంతో సిటీకి వస్తాడు. ఆ లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో వేరే సమస్యల్లో ఇరుక్కుంటాడు. ఆ సమస్యల్ని పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తుంటాడు. దాంతో లక్ష్యం పక్కదారి పడుతుంది. చూస్తున్న ఆడియన్స్‌కి కూడా లక్ష్యాన్ని పక్కన పడేశాడే అనిపిస్తుంది.. చివరకు తను అనుకున్నది సాధించాడా ? లేదా? అనేదే మా 'భజే వాయు వేగం' ' అంటున్నారు దర్శకుడు ప్రశాంత్ రెడ్డి. ఆయన దర్శకత్వంలో కార్తికేయ గుమ్మకొండ హీరోగా రూపొందిన ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక నిర్మాణసంస్థ యూవీ క్రియేషన్స్ సమర్పిస్తున్నది. ఈ నెల 31న సినిమా విడుదల కానున్న సందర్భంగా దర్శకుడు ప్రశాంత్‌రెడ్డి విలేకరులతో ముచ్చటించారు. ' కథ ప్రకారం ప్రథమార్ధం పర్‌ఫార్మర్ కావాలి. ద్వితీయార్ధం హీరోయిజం ఎలివేట్ కావాలి. అందుకే కార్తికేయను బెస్ట్ ఆప్షన్ అనుకున్నాను. తను చక్కగా నటిస్తాడు. అద్భుతంగా హీరోయిజాన్ని పండిస్తాడు. అనుకున్నట్టే చేశాడు కూడా. ఇందులో హీరోయిన్‌గా ఐశ్వర్య మీనన్ కూడా పర్‌ఫెక్ట్ ఆప్షన్. సంప్రదాయబద్ధమైన అమ్మాయిగా తను కనిపిస్తుంది.' అని తెలిపారు ప్రశాంత్‌రెడ్డి. ఈ సినిమాట్రైలర్‌కి మంచి స్పందన వస్తున్నదని, సినిమా ఊహలకు అందనంత గొప్పగా ఉంటుందని, ఈ సినిమాకు 'స్పీడ్' అనే టైటిల్ అనుకున్నామని, అయితే తెలుగులో ఉంటే బావుంటుందని అఖిల్‌తో యూవీలో సినిమా చేస్తున్న డైరెక్టర్ అనిల్ 'భజే వాయు వేగం' పేరుని సూచించారని, పేరుకు తగ్గట్టే సినిమా వేగంగా ఉంటుందని ప్రశాంత్‌రెడ్డి చెప్పారు. అత్యున్నత సాంకేతిక విలువలతో సినిమా ఉంటుందని, రాజమౌళి ప్రేరణతో ఇండస్ట్రీకి వచ్చిన తనకు మంచి దర్శకుడిగా పేరు తెచ్చుకోవడమే లక్ష్యమని ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

# గుణశేఖర్ కొత్త సినిమా 'యుఫోరియా'



లాఠీ, సొగసుచూడ తరమా, చూడాలనివుంది, మనోహరం, ఒక్కడు, అర్జున్.. ఈ సినిమాలు దర్శకుడిగా గుణశేఖర్ ఏంటో చెబుతాయి. ట్రెండ్‌కి భిన్నంగా సాహసంతో సినిమాలు తీయడం గుణశేఖర్ శైలి. ఆయన రీసెంట్ సినిమా 'శాకుంతలం' పౌరాణికం. ఈ రోజుల్లో ఆ సినిమా తీయడం నిజంగా సాహసమే. త్వరలో ఆయన మరో వైవిధ్యమైన కథతో రానున్నారు. సినిమా పేరు 'యుఫోరియా'. ఈ యూత్‌ఫుల్ సోషల్ డ్రామాను గుణ హ్యాండ్‌మేడ్ ఫిలింస్ పతాకంపై నీలిమ గుణ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నది. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానున్న ఈ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలో తెలియజేస్తామని మేకర్స్ తెలిపారు.

# క్రియేటివ్‌గా ఆలోచించాలి



తెలుగు సినీరంగంలో పబ్లిసిటీ డిజైనర్‌గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు వివ రెడ్డి. బొమ్మరిల్లు, చంద్రముఖి, దేశముదురు, పోకిరీ, జై బోలో తెలంగాణ వంటి హిట్ చిత్రాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. పబ్లిసిటీ డిజైనర్‌గా వివ రెడ్డి పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఇటీవల ఆయన జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా స్వస్థలం వరంగల్. 1999లో హైదరాబాద్ వచ్చాను. జేఎన్టీయూ యూనివర్సిటీలో బీఎఫ్ఏ పూర్తి చేశాను. 'దిల్' సినిమా టైటిల్ లోగోతో డిజైనర్‌గా సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టా. ఇప్పటివరకు 500పైగా సినిమాలకు పబ్లిసిటీ డిజైనర్‌గా పని చేశాను. ఎందరో స్టార్ హీరోల చిత్రాలకు చేసిన టైటిల్ లోగోలు మంచి పేరు తెచ్చిపెట్టాయి. దాసరి నారాయణరావు, వంశీ వంటి దర్శకుల ప్రశంసలందుకోవడం మరచిపోలేని అనుభూతినిచ్చింది' అన్నారు. పబ్లిసిటీ డిజైన్‌తో పాటు నటుడిగా రాణిస్తున్నానని, ఇప్పటివరకు 25 సినిమాల్లో నటించానని వివ రెడ్డి తెలిపారు. 'ప్రస్తుతం ఓ తండ్రి తీర్పు, లగ్గం వంటి సినిమాల్లో మంచి క్యారెక్టర్స్ చేస్తున్నా. మరింత సృజనాత్మకంగా ఆలోచిస్తూ పబ్లిసిటీ డిజైనింగ్‌తో పాటు నటుడిగా రాణించాలనుకుంటున్నా' అని ఆయన పేర్కొన్నారు.

# తమిళంలో బంపరాఫర్



ఇటీవల విడుదలైన 'ప్రేమలు' చిత్రం ద్వారా యువతరం హృదయాలను దోచుకుంది మలయాళీ సోయగం మమతా బైజు. చూడముచ్చటైన అందం, అభినయంతో అందరిని మెప్పించింది. ప్రస్తుతం ఈ భామకు అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కథాంశాల ఎంపికలో సెలెక్టివ్‌గా ఉంటున్న ఈ భామ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చే విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నది. తాజాగా ఈ అమ్మడు తమిళంలో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పింది. వివరాల్లోకి వెళితే..'లవ్ టుడే' చిత్రంతో దక్షిణాదిలో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్. ప్రస్తుతం ఆయన కీర్తిశ్వరన్ అనే దర్శకుడితో సినిమా చేయబోతున్నారు. ఇందులో మమితా బైజు కథానాయికగా ఎంపికైంది. 'రెబెల్' తర్వాత ఈ ముద్దుగుమ్మ నటిస్తున్న తమిళ చిత్రమిది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. న్యూఏజ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని అన్ని దక్షిణాది భాషల్లో విడుదల చేస్తారని చెబుతున్నారు.

# శ్రీ రామానుజాచార్యుల సందేశం



లయన్ డా|| సాయివెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జయహో రామానుజ'. సుదర్శనం ప్రొడక్షన్స్ పతాకంపై సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్నారు. రెండు భాగాలను తెరకెక్కిస్తున్నారు. తొలిభాగం ఈ జూలై 12న ప్రేక్షకుల ముందుకురానుంది. మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నటుడు, దర్శకుడు సాయివెంకట్ మాట్లాడుతూ 'కులమతాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో జీవించాలని, మహిళలను గౌరవించాలని గొప్ప సందేశాన్నందించిన భగవత్ శ్రీరామానుజాచార్యుల వారి గురించి నేటి తరానికి తెలియజెప్పే చిత్రమిది' అన్నారు. అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమాను తెరకెక్కించామని నిర్మాతలు సాయిప్రసన్న, ప్రవళ్లిక తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.